క్లుప్తంగా

పెసర రైతులకు పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోనకల్: అధిక వర్షాలకు పెసర పంట దెబ్బతిన్నందున నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు దొండపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించాక ఆయన మాట్లాడారు. మండలంలో 400 ఎకరాలకు పైగా పెసర పంట దెబ్బతిన్నందున సర్వే నిర్వహించి పరిహారం చెల్లించాలని కోరారు. సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, కిలారు సురేష్, రైతు సంఘం నాయకులు కొంగర భాస్కర్‌రావు, వీరభద్రం తదితరులు ఉన్నారు.

దేశ భవిష్యత్‌లో యువత భాగస్వాములు కావాలి

కొణిజర్ల: దేశ భవిష్యత్‌లో కీలకమైన యువత సృజనాత్మకతంగా ఆలోచిస్తూ ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సీపీఎం జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ బండారు రమేష్ సూచించారు. మండలంలోని చిన్న మునగాలలో డీవైఎఫ్ఐ సమావేశం చింతనిప్పు నరసింహారావు అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగి ఉండి చదువుపై శ్రద్ధపై కనబర్చాలని తెలిపారు. ఇదేసమయాన అవినీతి, కుల మత విద్వేషాలపై పోరాడాలని సూచించారు. అనంతరం డీవైఎఫ్ఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గుడిమెళ్ల మధు, గమిడి నరేష్ ఎన్నికకాగా, నాయకులు కంపసాటి శివ, తాతా శేషయ్య, పాపగంటి ఆశీర్వాదం, గుడిమళ్ల దానేష్, సురేష్, నగేష్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారేపల్లి పాతపోస్టాఫీసు బజార్‌కు చెందిన ఆటోడ్రైవర్ తురక సర్వేశ్వరరావు కుటుంబానికి ఆయన పదో తరగతి స్నేహితులు సోమవారం రూ.14,600 నగదు అందజేశారు. సర్వేశ్వరరావు మిత్రులు జె.శ్రీనివాసరావు, పెద్దమ్మ మల్లేష్, కేలోతు నరేష్, జూపల్లి వెంకటరమణ, షరీఫ్, జంగా మధు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. సాగు ఎలా?

- ఎన్నెస్పీ కాల్వల నిండా ముళ్లకంప, పిచ్చిచెట్లు
- ఫలితంగా నీటి సరఫరాలో అడ్డంకులు
- నిధులు విడుదలైనా మొదలుకాని పనులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌పీ) కాల్వలు అధ్వానంగా మారాయి. కాల్వల్లో పలుచోట్ల ముళ్లకంప, పిచ్చిచెట్లు మొలిచి వృక్షాలుగా తయారయ్యాయి. మండలంలో మైలవరం బ్రాంచ్ కెనాల్ 10 కి.మీ., మూలపాడు మేజర్ 7.2 కి.మీ., ఇబ్రహీంపట్నం మేజర్ 3.2 కి.మీ., జమలాపురం మేజర్ 19 కి.మీ.తో పాటు నిదానపురం మేజర్ కెనాల్ 5 కి.మీ. పొడవుతో ఉంది. ఈ కాల్వల కింద మొత్తంగా 20,812 ఎకరాల భూమి సాగు కావాల్సి ఉంది. అయితే, ఈ కాల్వల్లో దట్టంగా పిచ్చిచెట్లు పెరగడంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. జంగిల్ క్లియరెన్స్‌కు రూ.5లక్షల నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు జరగడం లేదని తెలుస్తోంది.

రెండు జోన్ల ద్వారా

ప్రస్తుతం ఈ కాల్వలకు సాగర్ మూడో జోన్ ద్వారా సాగునీరు అందుతోంది. ఇక నిదానపురం మేజర్ పరిధి మీనవోలు, తక్కెళ్లపాడు, సఖినవీడు, ములుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాలకు మాత్రం రెండో జోన్ ద్వారా నీళ్లు వస్తున్నాయి. అయితే, మూడో జోన్ నుంచి సాగునీరు



ముళ్లకంపతో మూసుకుపోయిన మూలపాడు మేజర్ కెనాల్

విడుదలైనా చివరి ఆయకట్టుకు చేరకపోవడంతో ఏటా పంటలు ఎండిపోతున్నాయి. దీంతో జోన్ మార్పించడమే కాక ఆయకట్టుకు సాగునీరు సమృద్ధిగా అందించాలనే యోచనతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ.600 కోట్లతో జవహర్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇటీవల మధిర మండలం వంగవీడులో శంకుస్థాపన చేశారు. అయితే, ఇది అందుబాటులోకి వచ్చేవరకు కాలువల్లో అడ్డంకులు తొలగిస్తే కొద్దోగొప్పో సాగునీరు అందే అవకాశం ఉంటుంది. ఇక మండలంలోని నాలుగు క్లస్టర్లుగా సాగర్ కెనాల్ ఏరియాకు నలురురు ఏఈలు ఉన్నా లస్కర్ల కొరత వేధిస్తోంది. నాలుగు క్లస్టర్లల్లో 18 మందికి గాను ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కెనాళ్లపై పర్యవేక్షణ కొరవడి సాగునీటి సరఫరా అవాంతరాలు ఎదురవుతున్నాయి.

నీరు విడుదల చేసినా వృథానే



కెనాళ్లలో దట్టంగా సర్కార్ ముళ్లకంప, పిచ్చి చెట్లు పెరిగాయి. దీంతో నీరు విడుదల పారే అవకాశం లేదు. కాల్వలను శుభ్రం చేయకపోతే పొలాలకు నీరు చేరడం కష్టమవుతుంది. ఇప్పటికైనా అధికారులు కాల్వలను శుభ్రం చేయించాలి.

– వేమిరెడ్డి మల్లారెడ్డి, రైతు, తెల్లపాలెం

అధికారులు స్పందించాలి



ఇప్పటికే మండలం మూడో జోన్‌లో ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇక వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కాల్వల్లో కంప, పిచ్చిచెట్లను తొలగించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదు.

– దివ్వెల వీరయ్య, రైతు, భీమవరం

లష్కర్లతో తీయిస్తాం



సాగర్‌కాల్వల్లో ముళ్లకంప, పిచ్చి చెట్ల తొలగింపునకు ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ మైలవరం బ్రాంచ్ కెనాల్ పరిధి కాల్వలో తొలగించారు. ఆతర్వాత తమకు గిట్టుబాటు కాదని వెనక్కి తగ్గారు. లష్కర్లతో త్వరలోనే పనులు చేయిస్తాం.

– సాంబశివరావు, డీఈ, జలవనరుల శాఖ

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

వైరా/సత్తుపల్లి టౌన్: నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన ఆనాటి నాయకుల స్ఫూర్తితో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం వైరా, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, శీలం సత్యనారాయణరెడ్డి సూచించారు. వైరా, సత్తుపల్లిలో సోమవారం జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఈనెల 17న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు సభను విజయవంతం చేయాలని తెలిపారు. నాయకులు బాజోజు రమణ, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శరాబంధీ, నాగరాజు, లక్ష్మణ్, రాజా, జయరాజు, జాజిరి శ్రీనివాస్, జాజిరి జ్యోతి, రాములు, రఘు, వేలాద్రి, వెంకటేశ్వరరావు, సనందరావు, కృష్ణ, సత్యం పాల్గొన్నారు.

ఆ ఘనత కమ్యూనిస్టులదే..

సత్తుపల్లిరూరల్: దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని



వైరా : సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం యాతాలకుంటలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. కొర్సా జోగయ్య, పెంటమ్మ స్థూపాల వద్ద నివాళులర్పించాక ఆయన మాట్లాడుతూ నైజాం నవాబును గద్దె దించిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. నాయకులు దండు ఆదినారాయణ, తాటి వెంకటేశ్వరరావు, కళావతి, పూర్ణచంద్రరావు, యోబు, రామకృష్ణ, వీరయ్య, రంజాన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

భట్టి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

మధిర: సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. మధిరలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సీఐటీయూ నాయకులు మందా సైదులు, పాపినేని రామనరసయ్య మాట్లాడారు. ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల వేతనాన్ని రూ.18 వేలకు పెంచడంతో పాటు 24 రోజుల సమ్మె కాలం వేతనాలు చెల్లించాలని కోరారు. అంతేకాకుండా కేంద్రాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆసరా పెన్షన్లు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాగా, ధర్నా సందర్భంగా భట్టి క్యాంపు కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

పీఎన్ఎం డివిజన్ మహాసభ

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని వీఎం.బంజరలో సోమవారం ప్రజా నాట్యమండలి డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సభకు సండే సత్యం, పరిగడుపు రాములు అధ్యక్షత వహించగా, డివిజన్ అధ్యక్షుడు సండే సత్యం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీఐటీ యూ, సీపీఎం నాయకులు చలమాల విఠల్, శీలం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం మొదలు తెలంగాణ ఉద్యమం వరకు కళాకారుల పాత్ర మరువలేనిదని తెలిపారు. అనంతరం కళాకారులకు పెన్షన్ సౌకర్యంతో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పెనుబల్లి తహసీల్దార్ నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేముల సందానందం, గుణగంటి లక్ష్మీనారాయణ, నాయకులు తాండ్ర రాజేశ్వరరావు, భోగి మోహన్‌రావు, మిట్టపల్లి నాగమణి, గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, చిట్టి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు



కల్లూరు రూరల్ : వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కల్లూరురూరల్/పెనుబల్లి: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన కల్లూరు మండలం కిష్టయ్య బంజరు గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే, అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. ప్రభుత్వ వైద్యులు నవ్యకాంత్, నితిన్‌తో పాటు ఉద్యోగులు గుండెని రామారావు, పద్మ, శివసాని రాణి పాల్గొన్నారు. అలాగే, పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన ఉప్పలచలక హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేయడంతో పాటు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బి.నాగేశ్వరరావు, కవిత, అశోక్, కల్పన, హాస్టల్ ఎస్ఓ సీహెచ్ వెంకటరమణ, సిబ్బంది సునీత తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

తల్లాడలో ప్రదర్శన, తహసీల్దార్‌కు వినతిపత్రం

తల్లాడ: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న ‘సాక్షి’ పత్రికపై అక్కడి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం గర్హనీయమని తల్లాడలో ప్రెస్‌క్లబ్ బాధ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసులను ఎత్తివేయాలనే డిమాండ్‌తో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన సోమవారం ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, ఖమ్మంలో ఓ చానల్ జర్నలిస్టు సాంబశివరావుపై పెట్టిన కేసులను సైతం ఎత్తివేయాలని కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జి.నారాయణ, గౌరవ అధ్యక్షుడు డి.అజయ్‌కుమార్‌తో పాటు ఎండీ.ముస్తఫా, ఎం.అప్పిరెడ్డి, జయరాజు, ఎ.శేషగిరిరావు, షేక్ మెహరాజ్, నారాయణరావు, ఆర్.నరసింహాచారి, జి.నాగబాబు, కరుణాకర్‌రెడ్డి, యాకూబ్, శ్రీనివాసరావు, నవీన్, చలపతి గౌడ్, నరేష్ పాల్గొన్నారు.



తల్లాడ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

● **కారేపల్లి:** రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను కవర్ చేసిన ఓ చానల్ ప్రతినిధి సాంబశివరావు, సిబ్బందిపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కారేపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బీమవరపు శ్రీనివాసరావుతో పాటు కొండపల్లి వెంకటేశ్వర్లు, ఏపూరి లక్ష్మీనారాయణ, అనంతారపు వెంకటాచారి, పాలిక శ్రీనివాస్, తేళ్ల శ్రీనివాసరావు, బాదావత్ రాము, బానోతు బాలునాయక్, జంగా నరేష్, కందుల ప్రసాద్, కేతిమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇప్పిస్తాం..

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

వేంసూరు: వరి విత్తన లోపంతో నష్టపోయిన రైతులకు కంపెనీ నుంచి పరిహారం ఇప్పిస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి భరోసా ఇచ్చారు. అన్నారు. వేంసూరు మండలం భరణిపాడు, కందుకూరులో అగ్రోటెక్ కంపెనీకి చెందిన వరి రకం 2782 విత్తనాలు సాగు చేయగా, ముందుగానే ఈతకు రావడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే సోమవారం పొలాలను పరిశీలించాక కందుకూరు జీపీ కార్యాలయంలో అధికారులు, రైతులతో సమావేశమయ్యారు. నష్టంపై అధికారులు సమగ్రమైన నివేదిక ఇస్తే యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు. మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, ఏడీఏ శ్రీనివాసరెడ్డితో పాటు గొర్ల వెంకటప్పారెడ్డి, వెల్డి జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● **తల్లాడ:** తల్లిదండ్రులకు మించిన దైవం లేదనే విషయాన్ని విద్యార్థులు గుర్తించి చిన్నతనం నుంచే



వేంసూరు: పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి సూచించారు. తల్లాడలో సోమవారం ఇన్‌స్పైర్ – ఇగ్నైట్ ఆధ్వర్యాన విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. గురువులు మాటను గౌరవిస్తూ లక్ష్యాన్ని సాధించే వరకు కష్టపడాలని.. తద్వారా గురువులు, తల్లిదండ్రులకు పేరు తేవాలని తెలిపారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కాపా సుధాకర్, గుర్రం శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్, రాయల రాము పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాల్సిందే..



వైరా: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు



మధిర: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యాన ఆధ్వర్యాన సోమవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ, తల్లాడ, వైరా, ఏన్కూరు, కారేపల్లి, తహసీల్‌ల ఎదుట ధర్నా అనంతరం తహసీల్దార్లు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఏనూక, కనకపుడి శ్రీనివాస్, రాయబారపు దాసు, కూరపాటి సురేష్, పగిడికత్తుల ఈదయ్య, సురేష్, గట్టిగుండ కిషోర్, చిలకా నాగరాజు, చింతకాయల వెంకటేశ్వర్లు, తాటికొండ వెంకటరత్నం, కొమ్ము జాన్‌రాజ్, రవీందర్, చిర్రా ఉపేందర్, అంజయ్య, ఇనుప ఉపేందర్, రాంబాబు, మోదుగు కృష్ణ, ఎక్కిరాల నాగేశ్వర్



తల్లాడలో..

రావు, రావూరి కృష్ణ, ఎక్కిరాల సుజాత, కోట కోటేశ్వరరావు, నల్లగట్ల నాగేశ్వరరావు, అంజలి, కొండూరి రాజేష్, దామెర్ల వీరయ్య, బోయ సుదర్శనంతో పాటు రవి, చంద్రిక, జగన్నాథం, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామపెద్దలు

చింతకాని: మండలంలోని నాగులవంచలో దుర్గాదేవి నవరాత్రోత్సవాల సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామపెద్దలు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రాళ్లబండి వెంకటరమణ శాస్త్రి పూజలు చేయగా, స్థలదాత ఝునిశెట్టి వెంకట కృష్ణారావు, గ్రామపెద్దలు ఆలస్యం బస్వయ్య, మద్దినేని వెంకటేశ్వరరావు, వంకాయలపాటి లచ్చయ్య, అంబటి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణచారి

ఏన్కూరు: తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఏన్కూరుకు చెందిన పెద్దపల్లి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయనకు సంఘం రాష్ట్ర కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, కృష్ణమాచార్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న సత్యనారాయణ చారి

మధిర ఎంఈఓకు సన్మానం

మధిర: మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్‌ను సోమవారం ఆంగ్ల ఉపాధ్యాయులు సన్మానించారు. ఇటీవల ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ప్రభాకర్ టీవీఎం హైస్కూల్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణకు హాజరు ఆయనను సన్మానించారు. అలాగే, గత విద్యాసంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులు మల్లాది విజయలక్ష్మి, మహబూబ్ సుల్తానా, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు రాజు, వి.రామరత్నంను ఎంఈఓ సన్మానించి అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

మధిర: ఆర్టీసీ కండక్టర్ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మధిర డిపోలో 30ఏళ్లుగా కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.అంబేద్కర్(59) సోమవారం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు వచ్చింది. అంబేద్కర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డిప్యూటీ సీఎం పీఏకు పదోన్నతి

మధిర: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పీఏగా పనిచేస్తున్న కె.రాజేష్‌కు పదోన్నతి లభించింది. ఆయన పదోన్నతిపై మహబూబాబాద్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. భట్టి వద్ద ఐదేళ్లుగా పనిచేస్తున్న రాజేష్ పదోన్నతి పొందడంపై పలువురు అభినందించారు.

కేజీబీవీలో నియామకాలకు దరఖాస్తులు

పెనుబల్లి: పెనుబల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్, స్వీపర్ – స్కావెంజర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటు ఎంఈఓ తెలిపారు. 18 – 45 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు ఈనెల 20లోగా గెజిటెడ్ అధికారి సంతకంతో 7వ తరతగతి స్టడీ సర్టిఫికెట్, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, అనుభవం సర్టిఫికెట్, రెండు ఫొటోలు సమర్పించాలని సూచించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



జీపీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ముదిగొండ: మండలంలోని పెద్దమండవలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం మధిర డివిజన్, మండల కార్యదర్శులు మడుపల్లి గోపాల్‌రావు, భట్టు పురుషోత్తం, నాయకులు కందిమళ్ల తిరుపతి, మాదాపురం సత్యనారాయణ, శ్రీనివాసరావు, కల్యాణ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు అవగాహన

కొణిజర్ల: మండల కేంద్రంలోని సమత సూపర్ జెమ్స్ పాఠశాలలో సోమవారం సంకల్ప్ చైల్డ్ లైన్ ఆధ్వర్యాన పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శక్తి సదన్, సఖి నివాస్, ఉమెన్ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై ఫిర్యాదు చేసే అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారిత కోఆర్డినేటర్ ఎస్‌డీ.సమ్రీన్, మానస, సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ కొణతం ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

17న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మధిర: ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సబ్‌

సంక్షిప్తంగా..

స్టేషన్‌లో ఈనెల 17న విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు మధిర ఏడీఈ ఎం.అనురాధ తెలిపారు. విద్యుత్ సర్వీసుల పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, నూతన సర్వీసులు, పేరు, కేటగిరీ మార్పు తదితర అంశాలపై వినియోగదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సదస్సులో ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్.వీ.వేణుగోపాలచారి, సభ్యులు పాల్గొంటారని తెలిపారు. మధిర, ఎర్రుపాలెం మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మధిర: మండలంలోని సైదల్లిపురానికి చెందిన వేమిరెడ్డి లక్ష్మారెడ్డి(26) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహం వద్ద మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి నివాళులర్పించి, తల్లిదండ్రులు కృష్ణారెడ్డి – భారతిని పరామర్శించారు. నాయకులు డాక్టర్ కోట రాంబాబు, సూరంశెట్టి కిషోర్, యన్నం కోటేశ్వరరావు, అమరవాది సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, కపిలవాయి సత్యనారాయణరాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న నాయకులు

పలువురి కుటుంబాలకు పరామర్శ

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక, సఖినవీడు, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సోమవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, నాయకులు శీలం ప్రతాప్‌రెడ్డి, చావా రామకృష్ణ, పంబి సాంబశివరావు, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి మృతి

కల్లూరురూరల్: కల్లూరు మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయన రెండేళ్లుగా కల్లూరులోవిధులు నిర్వర్తిస్తున్నారు. యాదగిరి మృతిపై ఎంపీడీఓ డి.చంద్రశేఖర్, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

సీపీఎం నాయకురాలికి నివాళి

చింతకాని: మండలంలోని కొదుమూరుకు చెందిన సీపీఎం నాయకురాలు దంతాల సీతమ్మ(55) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. ఆమె మృతదేహం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు మాదినేని రమేష్, రాచబంటి రాము, నక్కనబోయిన శాంతారావు, తిగుళ్ల నాగులు, మాదినేని రవి, బందెల కళ్యాణ్, చిట్టమోదు చిన్న లింగయ్య, బాలాజీ, శ్రీను తదితరులు నివాళులర్పించారు.

మరువలేని నాయకుడు సీతారాం

పెనుబల్లి: పేద ప్రజల కోసం పథకాల అమలు, సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించిన సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. మండలంలోని లంకపల్లి సుందరయ్య కాలనీలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు పోతిని బుచ్చయ్య, గుడిమెట్ల బాబు, గొల్లమందల సరసమ్మ, సుక్కుబాయి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఫకీర్‌సాహెబ్, కొర్రయ్య, నాగమణి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, మెకానిక్ వర్కర్ల కమిటీ ఎన్నిక

కారేపల్లి: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, మెకానిక్ వర్కర్ల సింగరేణి మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బోగిళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా షేక్ ఖాజావలి, కార్యదర్శిగా కేతమల్ల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కుమ్మరి నవకిషోర్, కోశాధికారిగా వేములపల్లి కృష్ణప్రసాద్, ప్రచార కార్యదర్శులుగా కె.పృథ్వీరాజ్, షేక్ మజీద్‌పాషా, యాకూబ్ పాషా, సలహాదారులుగా బొందల వెంకటేశ్వర్లు, భూక్యా హుస్సేన్, పిట్టల నాగరాజు, షేక్ మీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

చింతకాని: మండలంలోని నేరడకు కోట లక్ష్మికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫారసుతో సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైంది. ఆమె చికిత్స కోసం రూ.20వేలు చెక్కును సోమవారం సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు అందజేశారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు మంకెన నాగేశ్వరరావు, చెవుల తిరుపతిరావు, వంకాయలపాటి మాధవరావు, షేక్ దస్తగిరి, మట్టా రవి, గుండెపోగు ప్రభాకర్, కోట రాములు, హుస్సేన్ పాల్గొన్నారు.

కారు ఢీ కొని యువకుడికి గాయాలు

వైరా: వైరా సాయిబాబా దేవాలయం సమీపంలో కారు బైక్‌ను ఢీకొనడంతో యువకుడికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీనివాస్ బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో శ్రీనివాస్ కాలు నుజ్జయింది. వైరా సీఐ ఎన్.సాగర్, ట్రెయినీ ఎస్సై పవన్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన వంకాయలపాటి దాసయ్య, ఆయన కుమారులు రామారావు, శ్రీనివాసరావుపై సోమవారం కేసు నమోదైంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధి కొత్తగూడెంకు చెందిన శీతం రామసంగంకు వ్యక్తికి నాగులవంచ రెవెన్యూ పరిధిలో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కౌలుకు తీసుకున్న తిరుమలాపురం గ్రామానికి చెందిన బల్లి వీరభద్రం సాగు చేసిన పెసరను కోసేందుకు సిద్ధం కాగా ఈనెల 3న దాసయ్య, ఆయన కుమారులు అడ్డుకున్నారు. అంతేకాక పొలంలోకి వెళ్లే దారికి అడ్డంగా కందకం తీశారు. ఈ ఘటనతో రైతుకు రూ.1.10 లక్షల మేర నష్టం జరగగా రామసంగం ఇచ్చిన ఫిర్యాదతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.